

# చట్టాల చట్రాల్లో....



కె. జనార్ధనశర్మ

*జీవనాధారం కొందరికే చూపిస్తానంటే మరికొందరు వెనకపడిపోరా? వారిని ఊరడించే నాథుడేడి?*

ఉస్సురని నిట్టూర్చారు సుందరం మాస్టారు.

"ఎంతెయ్యమంటారు. రెండు కిలోలు వేసేదా" అన్నాడు షావుకారు.

తల వూపారు మాస్టారు.

"ఏది తప్పుతుంది కనకా. నుయ్యి లోతుంది అన్చెప్పి తాడు వెయ్యక మానతామా. మరో బారెడు లోపలికి వంగయినా నీళ్ళు చేదుకోవటం మానం కదా...." మాస్టారి మనసు ఘోషిస్తోంది.

నూనె తూస్తున్నాడు షావుకారు.

ఆలోచనల్లోకి జారిపోతున్న మాస్టారు ఎవరో గిల్లినట్టయి ఉలిక్కిపడ్డాడు....

"అబ్బబ్బ షావుకారూ.. ఆ రేడియో కాస్త కట్టించవోయ్ నీకు పుణ్యముంటుందీ...." ప్రాధేయపడ్డాడు చనువుగా.

"ఏంది పంతులారూ.. వొంట్లో బావుల్యేదా...... అలాగున్నారు" అంటూ 'హారేయ్.... ఆ రేడియో కాస్త తగ్గించరా' అంటూ పక్కన అరుగుమీదికి ఓకేక విసిరాడు షావుకారు.

రేడియో చిన్నబోయింది. సన్నబడింది.

"అవునుగానీ షావుకారూ. ఆ పాట రాసిన కవిగారికి సరుకులన్నీ వూరికినే పంపిస్తున్నావా ఏమిటోయ్ .... లేపోతే మాకిచ్చే రేట్లకంటె బాగా తగ్గింపుకేవన్నా ఇస్తున్నావా."

మాస్టారి మాట షావుకారికి బోధపడలేదు. ఏదో అర్థమైనట్టు వెకిలిగా నవ్వాడు. మాస్టారి తృప్తికోసం.

పర్సుతీసి షావుకారికి డబ్బు లిస్తూంటే మాస్టారి మనసు నిట్టూర్చింది.

నిన్న చూలింతలా వున్న పర్సు ఇవాళ బాలింతైపోయింది.

తన పర్సూ మారలేదు. తనూ మారలేదు. తన స్థితిగతులూ మారలేదు.

మారాయని నమ్మించుకోటం ఎలా?"

"మారాయోయ్" అని చెవులోకి బాకాలు ఊదుతూంటే....నిజమే కాబోలు ననుకొని నిట్టూర్చి వూరుకోవాలేమో.

నిస్పృహగా నవ్వుకొని సరుకుల సంచీ చేతులోకి తీసుకుని లేచాడా నడి వయసు వృద్ధుడు.

"గాడీ కావాలా బాబూ"

వద్దనబోయాడు కానీ, ఓ క్షణంపాటు సుఖాన్ని కోరింది మనసు.

తలెత్తి ఆ మనిషికేసి చూశాడు.

అతనూ తనలాగే వృద్ధుడు.. ప్చ్.. తన పాటి విశ్రాంతిని కూడా నోచుకొని జీవితం అతగాడిది. తనిచ్చే అర్ధరూపాయి డబ్బులూ అతగాడికి ఎన్ని అక్కర్లకొస్తయ్యో.

ఆ తాత కోసమైనా రిక్షా ఎక్కాలని కొట్టుకలాడింది మనసు.

"విచిత్రం. తన పాటికి తను మరో జీవితం మీద జాలిపడటం. తను పోవ దారిలేదు....తోదొక...."

చిత్రంగా నవ్వుకుని తల వూపాడు మాస్టారు.

"వంతెన దగ్గర శివాలయానికి ఎంత తీసుకుంటావు."

"రూపాయిప్పించండి బాబయ్యా."

గతుక్కుమంది గుండె.

చెట్టు ప్రదర్శించాడు.

"సరి సరి. ముష్టి ఫర్లాంగు దూరానికి రూపాయా. అర్ధరూపాయి ఇస్తా వస్తే రా....లేకపోతే లేదు...."

"అదేటి బాబో....అలాగంటారు.... సుట్టూతా తిప్పి తీసికెల్లద్దేటండి.... ముప్పావలా ఇప్పిచ్చండి...."

బిర్రబిగిశారు మాస్టారు.

"మూడు లేదూ నాలుగూలేదు....అర్ధ రూపాయి ఇస్తా వస్తేరా లేపోతే లేదు...."

"తమలాంటోరే అలాగంటే ఎలా గండీ.... వది పైసలిప్పించండి...."

మాస్టారు మాట్లాడలేదు. సంచీలు పుచ్చుకుని కదిలారు.

"సరే ఎక్కండి" రిక్షా తీసికొచ్చి పక్కనే నిలిపాడు.

విజయ గర్వంతో రథారోహణ చేశాడు మాస్టారి. భారంగా కదిలిందది.

రిక్షా తాత మోకాలి మడతల్లో కండరాలు గిజగిజలాడి సాగుతుంటే, రిక్షా భారంగా కదిలింది....

ఆ కష్టాన్ని చూస్తుంటే గిలగిల్లాడింది మాస్టారు మనసు.

తను రిక్షాలు లాగకపోయినా, బరువులు మొయ్యకపోయినా "జీవితాన్ని భారంగా లాగటంలోని కష్టం తెలుసు తనకి. బరువు బాధ్యతల శ్రమ తెలుసు తనకి."

రిక్షా తాతపట్ల సానుభూతి పెల్లుబికింది మాస్టారి మనసులో.

"ఈ కష్టజీవితోనా తను గీచి గీచి బేరమాడాడు. రూపాయి కష్టానికి అర్థరూపాయి విలువ కట్టాడు. కనీసం ముప్పావలా అన్నా ఇస్తాను. ఆ ఒక్క పావలా నన్ను ఉద్ధరించ బోతుందా...."

అనుకున్న మరుక్షణం మనసు మొరాయించింది.

ఆ ఒక్క పావలా బండి చక్రమంత ఎదిగి కంటిముందు నిలిచింది. తన విలువ చెప్పింది....విశ్వరూపం చూపిస్తూ.

"హాఁ వెధవ పావలా అని విసిరివేయగలిగేంత స్థితిలో వున్నావా నీవు. పావలా అంటే ఏమిటి....రూపాయిలో నాలుగో వంతు. నీకు నాలుగు షేవుల్కి వచ్చే బ్లేడు వస్తుందే. నెలలో సగం గడుస్తుందే ఆ బ్లేడుతో. లేదా ఓ పూటకి కూరవస్తుందే.. పావలా పెడితే పాతిక కట్టలు తోటకూర, పిల్లదానికి రెండు పెన్సిలు ముక్కలో నయ్యే.... రెణ్ణెల్లకి సరిపడా.. మూడు పళ్ళపొడుం పొట్లాలొస్తయ్యే.... నెలకి సరిపడా.... వెధవ పావలానా...."

దీర్ఘంగా నిట్టూర్చాడు మాస్టారు.

తనపాటికి తను మరో జీవిని చూసి జాలిపడేంత వాడా? పావలా బిళ్ళని అలా.... అలవోగ్గా.... విసిరి వేసేంత తాహతుగలవాడా?

మరో ప్రాణిని చూసి జాలిపడేంత తాహతా తనది....

వెర్రి....

మాస్టారి కుతూహలం ఎందుకో రిక్షాతాత స్థితిగతుల మీదకి పోయింది. అతగాడి జీవన సరళి ఎలా వుందో....అడిగి తెలుసుకోవాలనిపించింది. మెల్లిగా తాతని ప్రశ్నల్లోకి దింపాడు.

"తాతా! రోజుకు ఎంత మిగులుతుందోయ్ నీకీ రిక్షామీద?"

తాత సరిగా చెప్పలేకపోయాడు.

"ఎంతంటే ఏం చెప్పనండీ....బేరాల్ని బట్టి వుంటది. కానైతే....ఇప్పుడు సొంత రిక్షా....కాబట్టి .... రోజూ అద్దె డబ్బులు కట్టే బాధ తప్పింది కాదండీ...."

"ఉహూ....అయితే ఈ రిక్షా నీ సొంత మన్నమాట"

"అవునండీ .... ఆ పై కిందిచేదు.... బ్యాంకోళ్లు ఇచ్చినారండీ నెలనెలా నిక్కచ్చిగా నలభై కట్టేసి బాకీ చెల్లగొట్టేశాను కదండీ.... రిక్షా ఇప్పుడు నా సొంతం...." ధీమాగా చెప్పాడు తాత... "కానీ మావోళ్ళు శానామంది డబ్బుసరిగ్గా కట్టక ఆ బ్యాంకోళ్ళని రిక్షాల్చుట్టూ తిప్పించుకుంటన్నా



## NOTICE

Financially sound parties and can invest more than Rs 10,000 for interest may Contact,

Mr. Gopali Eraiah, M.A.,
KOSIGI-518 313
Kurnool (Dist) (A.P.)

To establish a Pharmaceuticals & drugs manufacturing Company in the Industrial Estate of ADONI (A.P).

ఉచితము! ఉచితము!

## తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుప రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మారుస్తుంది. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.

Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

## జ్యోతి పజిల్స్ రిజి. నెం. 2/77-78

చిన్ని ప్రశ్న నెం. 5. రు. 15.000
1 ఎంట్రీ 1 రు. 5 ఎంట్రీలు 4 రు.
ముగింపు : 18-12-77 ఫలితం: 28-12-77
వైరీలో.

రా——— ఈ ఖాళీని ఒక తెలుగు లేక హిందీ నటి లేక నటుని పేరుతో తెల్లకాగితంపై పూర్తిచేసి పంపండి. ప్రతి 5 ఎంట్రీలకు ఒక చీర లాటరీ తీయబడును. M.O. లను లేదా పోస్టల్ ఆర్డర్లను, ఎంట్రీలను ఈ క్రింది అడ్రసుకు (వెల్లటూరు ఆఫీసుకు) పంపండి.

M/s Jyothi Puzzles,
Vellatur (P.o)-522257
(Via) Tenali (R M S) Guntur (Dt.)

ఉచితము! ఉచితము!

## తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక పాకెట్ మందు పొందండి.

Jiwan Chikitsalava (12)
P. o. Katri sarai (GAYA)


రండి...." వాళ్ళతో తనని పోల్చి చూసుకుంటూ కాబోలు గర్వంగా ఓక్షణం మాట ఆపాడు తాత.

"నేను బాకీ తీర్చేసినాక ఆ కలెక్టరు బాబుకి చెప్పుకుంటే మా పెద్దోడికూడా బ్యాంకులో రిక్షా యిప్పించారండి.... ఆడికి సదూ అబ్బలేదు లెగండి.... మా రెండో ఆడికి గౌవర్నమెంటే సదూ సెప్పించింది. ఆడికి మంచుజ్జోగమే ఏయిస్తారంట.... ఆఫీసర్లాసే నవుకరీయేంట లెగండి.... ఆడు మాలా బళ్ళు లాక్కోక్కర్లేదు.... ఎట్టాగయినా సదూకునోళ్ళ వుజ్జోగాల దారే వేర్లెగండి...."

కళ్ళముందు కాంతి కిరణాలు కనపడుతున్నందు వలన కాబోలు - తాత హుషారుగా చెప్పుకుపోతున్నాడు. ఆ మానసికమైన ఉల్లాసం శరీరశ్రమని ఇట్టే మరిపిస్తుంది కాబోలు. వయోభారంకూడా తెలీదేమో.

"ఆ ల్లైవళ్ళో ఆ ధోళ్ళ సొసయిటీ ఆళ్ళంతా మా ఆడదానికి బ్యాంకిలో గేదకి డబ్బు లిప్పించినారు, పాడిమీద డబ్బులు యింకో ఆర్నెల్లు బ్యాంకికి కట్టేసినామంటే గేద మా సొంతమయిపోద్ది...."

తాతని చూసి ఒక్క క్షణం అసూయ పడ్డాడు మాస్టారు.

సంకుచితంగా ఆలోచిస్తున్నానేమో ననిపించినా, తాత మనసులోని విశ్రాంతిని చూసి అసూయపడకుండా ఉండలేకపోయాడు మాస్టారు. "అవున్నాయనా! నీ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకునే ప్రభుత్వం వుంది.... నీ దుస్థితినుంచి నిన్ను రక్షించే రాజ్యాంగం వుంది. నీ గురించి కవితలల్లే కవులున్నారు. నిన్నుచూసి జాలిపడి కథలల్లే రచయితలున్నారు.......నీ కోసం ఆక్రోశిస్తూ ఉపన్యసించే వక్తలున్నారు. నీ అభివృద్ధికి కంకణం కట్టుకుని నినాదాలిచ్చి, హామీలిచ్చి నీ వోట్లూ, నిన్ను చూపించి ఇతరుల వోట్లూ సంపాదించుకునే రాజకీయ నాయకులున్నారు .... నా కెవరున్నారు. నా దుస్థితిని కూడా గమనించి కనీసం సానుభూతి చూపించే వాళ్ళు కూడా లేరుకదా! నా తాత లెప్పుడో నేతులు తాగారని మాత్రమే గుర్తుంచుకుంది ప్రభుత్వం.."

...ఆలోచనా ధోరణిని బలవంతంగా అరికట్టాడు మాస్టారు.

"ఛ ఛ.... తాత లాంటి వాళ్ళ అభ్యున్నతిని ఆకాంక్షించటంలేదాతను."

"కాదే."

"మరెందుకు తనకీ ఆక్రోశం."

"ఇది అసూయతో కూడిన ఆక్రోశం కాదు....అశాంతి వలన కలిగిన ఆవేదన.... ఈ క్షణాన తనకి ముందురోజులపట్ల ఆశ లేదు. వర్తమానమే తనకో పెద్ద సవాల్‌గా వుంది. ఇంక రేపటిలెత్తి ముందుకెక్కడ చూడగలడు .... రెండేళ్ళనించీ ఉద్యోగం సద్యోగం లేక రోడ్లు పట్టుకు తిరుగుతున్నాడు కొడుకు....వాడి జీవితానికింకా స్థిరత్వం ఏర్పడలేదు. ఏర్పడుతుందన్న నమ్మకంలేదు. హామీలేదు.... ఎక్కడో ఎప్పుడో ఓ వారం పది రోజులపాటు తాత్కాలికంగా పని చేస్తాడు! లేని రోజున అదీలేదు. ఎక్కే గడప, దిగే గడప. వాడి ముఖంలో నైరాశ్యాన్ని, అసంతృప్తినీ, పరిస్థితులపట్ల అసహ్యాన్నీ భవిష్యత్‌పట్ల నమ్మకంలేని అస్థిరత్వాన్నీ: వీటన్నింటివలనా ఓ క్షణం నైరాశ్యంతోనూ, ఓ క్షణం క్రోధంతోనూ. కసితోనూ, తిరుగుబాటుతోనూ, మరోక్షణం ఏమీ చెయ్యలేని అసహాయతతోనూ, వాడి ముఖంలో రేగే రకరకాల భావాలని తను పసిగట్టక పోలేదు. ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడక, కడుపులో జ్వాలల్ని కడుపులోనే దిగనొక్కుతున్న వాడి హృదయంలోని సంచలనాన్ని తను గుర్తించకపోలేదు .... కానీ చేసేది ఏముంది కనుక....తను వాడికి ఏ ఆశలు చూపించగలడు కనుక.... వాడికి చదువుకూడా అంతంత మాత్రమే చెప్పించగలిగాడు తను. ఆ చదువు వాడికి పొట్ట గడుపుతుందన్న హామీ తనివ్వలేదు. అథవా ప్రస్తుతం చేస్తున్న టెంపరరీ ఉద్యోగమైనా ఖాయమౌతుందన్న నమ్మకం లేదు....

వాడి భవిష్యత్తు కోసం ఎక్కడా హామీలు రాసిలేవు. వాడి రక్షణ కోసం ఎక్కడా రాతకోతలు జరగలేదు.... వాడిని కూడా నిర్భాగ్యుల్లో ఒకడిగా గుర్తించటానికి తిరస్కరిస్తోంది....

వై....అది వాడి తాత ముత్తాతల పూర్వభవ సుకృతం - ఫలితం.

రిక్షా వంతెన దిగుతోంది.

"అదిగో ఆ శివాలయం పక్కనుందులోకి పోనివ్వు బాబూ."

రిక్షా ఆగింది.

సంచులు దించుకుని, తాత చేతిలో అర్థ రూపాయి కాసు పడేసి, ఇంట్లోకి కదిలాడు సుందరం మాస్టారు.

టైము ఎనిమిది దాటుతోంది.

"అన్నయ్య బ్యాంకికి వెళ్ళాడామ్మా?" ఎదురుగా వచ్చిన కూతురు కల్యాణిని అడిగారు.

"వెళ్ళాడు నాన్నా! అరగంటయ్యింది" అందా పిల్ల తండ్రి చేతిలో సంచులు తీసుకుంటూ. అరగంటయింది అని చెప్పటంలో

ఆ పూటకి ఇంత ఖరారైనన్న హామీని ఆ పేద తండ్రి మనసుకి కలగచేయాలన్న తాపత్రయం ఆ పిల్లకి.

ఆ పూటకి తృప్తిపడారు మాస్టారు.

"అంతే ఈ రోజుకి గడిచినట్లే నన్న మాట" అనుకుంటూ నిట్టూర్చారు.

"ఏదో వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా నాలుగు రాళ్ళు సంపాదించుకొస్తున్నాడు కుర్ర వెధవ. కానీ ఏ పూట కాపూటే దినదిన గండం. ఆ లీవులో వెళ్ళిన వ్యక్తి డ్యూటీకి వచ్చాడంటేవీడికి మళ్ళీ ఇల్లేగతి. మళ్ళీ ఇంకెవరో సెలవు పెట్టేవరకూ రోడ్లు పట్టుకు తిరుగుతూనే వుంటాడు. పోన్లే .... ఇంతతోనే తృప్తిపడదాం.... నెలకి నాలుగు రోజులు పనిచేసినా నాలుగు రాళ్ళు కనిపిస్తాయి ........ ఏదో వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు. కాలమలా దొర్లుకు పోతూనే వుంటుంది. భగవంతుడంటూ వుంటే వాడైనా వీడికి మంచి రోజులు చూపించక పోతాడా.... ఇలాగే వీలు దొరికినపుడల్లా టెంపరరీ పోస్టును జాగ్రత్తగా చేసుకుంటే ఏదో ఒక రోజున పర్మనెంటు చేస్తారన్న ఆశ లేకపోలేదు.

"తల్లీ !కొద్దిగా మంచినీళ్ళందుకోమ్మా."

తండ్రి తెచ్చిన కూరల్లోంచి ఓ నిమ్మకాయ కోసి. రసంపిండి తీసుకొచ్చింది ఆ పిల్ల.

"ఎందుకమ్మా ఇది!.... అలా వుంచక పోయావ్ అమ్మ కారం చేసేదేమోగా.."

"ఫర్వాలేదులే తీసుకో నాన్నా.. కారం దేముందిలె.... ఇంకోసారి చేసుకోవచ్చు".

బిడ్డ తన అనురాగాన్నంతా రంగరించి తీసుకువచ్చిన నిమ్మరసాన్ని ప్రేమగా ఆరగించాడు తండ్రి.

కళ్ళు చెమ్మగిల్లాయి.

"నువ్వింతగా నన్ను జాగ్రత్తగా చూసుకుంటున్నావె కానీ నీ కోసం నేనేమి చెయ్యలేకపోతున్నానే తల్లీ .... ఉండు వాడికో స్థిరమైన ఉద్యోగమంటూరానీ...." మౌనంగా మనసులో గొణుక్కున్నారు సుందరం మాస్టారు.

"అవునుమరి....వాడి ఉద్యోగంతో ముడిపడి ఇప్పుడు ఎన్ని అవసరా లున్నాయి....ఇన్ని అవసరాలూ తీర్చటానికి తన ఒకడివల్ల ఏమవుతుంది ...ఏదో వాడు అందివచ్చి ఆదుకుంటే కానీ....ఈ బండి చురుగ్గా—జీవంపోసుకుని—నడవదు."

పడక్కుర్చీలో చేరగిలబడి అలసటతో రెప్పలు వాల్చుకున్నాడాయన.

బయట పెరట్లోంచి వస్తున్న చల్లటి గాలి నుదుటికి తగిలి ఆ అలసట మెల్లి మెల్లిగా తొలగిపోయి. మనసునిండా తాత్కాలికమైన ప్రశాంతత ఆవరించుకుంది.... తెలియకుండానే చిన్న కునుకు పట్టింది....

.... ఆ కునుకులోనే ఎవరో తనని ఒక్కసారి కిందికి తోసినట్టయింది. ఏవో పాదాల చప్పుడు పులిక్కిపడి కళ్లు తెరిచే సరికి, పల్చగా కుష్కించిపోయిన చెప్పుల్ని మూలన విడుస్తూ కనుపించాడు కొడుకు సత్యం.

మౌనంగా వున్నాడు. ముఖంలో ఏ భావాలూ లేవు. కళ్ళని స్తేజంగావున్నాయి.

ఆ స్థితిలో వాడిని పలకరించటం భావ్యంగా తోచలేదు.

మౌనంగా వూరుకున్నాడు మాస్టారు. వాడే ఏదైనా చెపుతాడేమోనని చూశారు. అన్న ముఖంలోకీ,తండ్రి ముఖంలోకీ జాలిగా బాధగా చూసింది కల్యాణి.

ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా గోడవారనున్న రేకు పెట్టెమీద కూర్చుని, మోకాళ్ళచుట్టూ చేతులు బిగించి, ఆ చేతులకి నుదురానించుకున్నాడు సత్యం. కల్యాణి వంటగదిలోకి వెళ్ళింది. తల్లి ముందు గదిలోకి వచ్చింది.

డ్యూటి వుందనుకుని వెళ్ళిన కొడుకు అరగంటకే ఇంటికి తిరిగిరావటం. మళ్ళీ ఎప్పుడో వాళ్ళు పిలిచినపుడు వెళ్ళటం అలవాటయిన సంఘటనే అయినా, కొడుకు మౌనం, అతని ముఖంలో కనిపిస్తున్న తీవ్రమైన నిరుత్సాహం, ఆందోళన కలిగించింది ఆ దంపతులకి. తల్లే అనునయంగా కదిలించింది.

"ఏం జరిగిందేమిట్రా" అనడిగింది గుమ్మంలో నిలుచునే.

"ఏంవుంది డ్యూటిలేదు" తలవంచుకునే జవాబిచ్చాడు సత్యం.

"దానికంత ఇదెందుకు. మామూలేగా. పిలిచినపుడు మళ్ళీ వెళ్ళుదువుగానిలే. అంత దిగులెందుకు."

"ఇంక వెళ్ళే అవసరంలేదులే."

"అదేం?" ముసలి కంఠాలు రెండూ ఒక్కసారిగా వణుకుతూ దెబ్బ తిన్నట్లుగా ప్రశ్నించాయి.

"హెడ్డాఫీసు నుంచి తాకీదు వచ్చిందిట. ఈ లీవ్ వేకెన్సీని రిజర్వుడు కాండిడేట్‌కి కేటాయించారుట."

"పోన్లే పాపం....మరి నీకేదైనా వేరే చోట చూపిస్తారటనా" తండ్రి ఆరాటం.

చురుగ్గా తండ్రికేసి చూశాడు సత్యం. "ఊఁ ఇంక వాళ్ళకి అదేపని. నీ గురించీ నా గురించీ జాలిపడుతూ కూర్చోవటం" తీవ్రంగా అన్నాడు తండ్రి అమాయకత్వం మీద జాలిపడుతూ కోప్పడుతూ.

"అదేమన్న మాటరా" తల్లి మందలించింది. "పోనీ వాళ్ళనే ఏదో బ్రతిమలాడుకోపోయావా .... మంచిగా అడిగితే మనసు కరుగుతుంది. నేర్పుగా అడిగి కార్య సాధకం చేసుకోవాలి కానీ...."

"బావుందమ్మా నీ బాధ స్తం. రూలుని బట్టి వాళ్ళు నడుస్తారుకానీ వాళ్ళ చేతుల్లో ఏముంది. అయినా అన్ని ఘట్టాలూ, దేవిరింపులూ పూర్తి చేసుకునే వచ్చాను, ఏడుపొక్కటి తప్ప" తీవ్రమైన ఆవేశాన్ని, అసహనాన్ని తగ్గు మాటలతో వ్యక్తం చేస్తూ అన్నాడు సత్యం.

ఏం మాట్లాడటానికీ తోచక, ఏ ఆలోచనకీ బుర్ర పనిచేయక నిర్జీవంగా,నిస్తేజంగా వెనక్కి జారగిలబడ్డారు మాస్టారు. నిరుత్సాహం విశ్వరూపం దాలుస్తుంటే కనురెప్పలు భారంగా వాలిపోయాయి.

అంతలోనే ఏదో కలతనిద్ర., అలజడీ. ఆందోళనా....

ఏదో గోలతో ఉలిక్కిపడి మెలకువ తెచ్చుకున్నాడు.

చిన్నవెధవ గింగిరాలెత్తేలా ఏడుస్తున్నాడు....

"ఎందుకురా ఏడుపూ.." అసహనాన్ని కప్పిపుచ్చుతూ అనునయంగా అడిగాడు.

వాడు చెప్పింది విని ప్రాణం గిజగిజలాడింది మాస్టారికి.

కల్యాణిని పిలిచి కోప్పడ్డారు.

"ఏం పని చేశావమ్మా....తప్పుకాదూ. వాడు చూడు ఎలా ఏడుస్తున్నాడో...."

"ఏడవనీండి వెధవని....తిపరమా.... నెత్తిమిదికి ఎనిమిదేళ్ళొచ్చి చంటి పిల్లతో వాడికి పంతం ఏమిటండీ .... ఇన్నాళ్ళూ వాడికిమాత్రం జరగలేదూ భోగాలన్నీ...."

"తప్పమ్మా వాడిదిమాత్రంనోరుకాదూ. చంటిపిల్ల ఏడిస్తేమరోటోమరోటో ఇచ్చి ఊరడించాలికానీ.వీడినోటిదగ్గరదిలాక్కుని వీడిని ఉసూరుమనేలా ఏడిపించీ.. ఛఛ.. తప్పు కాదమ్మా...."

అంతదూరం ఆలోచించని కల్యాణి బిక్కచచ్చిపోయింది. సిగ్గుతో చితికిపోయింది. జాలిగా ఏడుస్తున్న తమ్ముణ్ణి చూసి తన అవివేకానికి గిలగిల్లాడిపోయింది. గబగబా వెళ్ళి వాడిని అక్కున చేర్చుకుని, చెంపలు నిమిరి.. "దా.. దారా నాన్న నీ కింకోటి ఇస్తాగా.. దామ్మ దా.." అంటూ బుజ్జగిస్తూ వాడిని లోపలికి తీసుకునిపోయింది....

....రేకు పెట్టెమీద ముడుచుకుని కూర్చున్న సత్యంకేసి బాధగా. జాలిగా చూశాడు మాసారు—

—వాడిని ఊరడించే నాధుడేడీ.... ★